## క్లుప్తంగా

### అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



**సత్తెనపల్లి:** వేసవిలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం బహుళ అంతస్తులు గల ఓ వైద్యశాలలో సిబ్బందికి పలు అంశాలు వివరించారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అనన్య హాస్పిటల్ అధినేత డాక్టర్ చల్లా నాగరాజారెడ్డి, అగ్నిమాపక సిబ్బంది అలా శ్రీనివాసరావు, సీహెచ్ సాగర్ బాబు, ఎం.మోహన్ బాబు, బి.నాగేశ్వరరావు, షేక్ బాజీలు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ట



**అమరావతి:** మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకరరావు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ నిర్వాహకులు శంకరరావుకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం చేయగా, ఆలయ నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు నాయుడు రాంబాబు, నాయుడు సాంబశివరావు, కోట హరిబాబు, అళ్ళ శ్రీనివాసరెడ్డి, వీరరాఘవయ్య, షేక్ హష్మీ, విజయసాగర్ బాబు, ఆలపాటి వీరయ్య, నంబూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంపై అవగాహన



**అచ్చంపేట:** పౌష్టికాహార వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన అచ్చంపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో మండల స్పెషల్ అధికారి వి.హనుమంతరావు, ఎంపీడీవో కోయా శ్రీనివాసరావులు మాట్లాడారు. గర్భవతులు, బాలింతలు తమ పిల్లలకు ఏ విధమైన ఆహారాన్ని అందించాలో వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పౌష్టిక ఆహారాన్ని తయారు చేసుకోవడం గురించి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పంతులూ నాయక్, సర్పంచ్ షేక్ జాని, అచ్చంపేటలోని అన్ని అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు.

### సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం




**రాజుపాలెం:** నాగార్జున విశ్వవిద్యాలయం తరఫున ఉన్నత విద్యను అందించడంతోపాటుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి బబిత తెలిపారు. మండలంలోని కొండమోడులో నాగార్జున యూనివర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం ఆధ్వర్యంలో 30 రోజులు మహిళలకు నిర్వహించిన జూట్ తయారీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు డాక్టర్ బి.బబిత ధ్రువీకరణ పత్రాలను అందించారు. 15 రకాల ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సీఎస్ఆర్ ప్రోగ్రాం అధికారి మండూరి వెంకటరమణ, పీఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిసె మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం

**రెంటచింతల:** మండలంలోని మంచికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డా. రామలింగారెడ్డి మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. క్యాంపు కోఆర్డినేటర్ కె. రాజు మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్న విద్యార్థులకు ఉచితంగా వైద్య సహాయం అందచేస్తామన్నారు. ఉపాధ్యాయులు షేక్ సిలార్ అహమ్మద్, టి. వెంకటేశ్వరరావు, వై.రమణారెడ్డి, షేక్ అహ్మద్ జానీ, వైద్య సిబ్బంది ఆప్టోమెట్రిస్ట్ ఫాతిమా, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ముప్పుతో చెలగాటం..!

- పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చి వేస్తున్న రైతులు
- ఇతర పంట పొలాలకు వ్యాపిస్తున్న మంటలు
- వాయు కాలుష్యంతో పరిసర ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- అడ్డగోలు పనులతో సాగు నేలలకు తప్పని చేటు
- వ్యర్థాలు కుళ్లబెడితేనే లాభమంటున్న అధికారులు


గోళ్లపాడు సమీపంలో తగలబెట్టిన మొక్కజొన్న పంట వ్యర్థాలు

**ముప్పాళ్ళ:** మండలంలోని కుందురువారిపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు మొక్కజొన్న కోత పూర్తయ్యాక పంట వ్యర్థాలకు నిప్పు పెట్టాడు. వేసవికాలంతోపాటుగా ఈదురుగాలులు తోడవటంతో మంటలు పక్కనే ఉన్న కోత కోయని పంటకు అంటుకొని పూర్తిగా బుగ్గిపాలైంది. ఐదుగురు రైతులకు చెందిన సుమారు 13 ఎకరాల్లోని మొక్కజొన్న పంట పూర్తిగా కాలిపోయింది. ఒక్కో ఎకరానికి సుమారు రూ.లక్ష చొప్పున నష్టం వాటిల్లింది. కేవలం ఖర్చు తగ్గించుకోవాలనే ఒకే ఒక్క కోణంతోటి రైతులకు నష్టాలు మిగిల్చింది. పంట వ్యర్థాలను తగలబెట్టడం వలన లాభాల కన్నా నష్టాలే అధికంగా ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు పంట వ్యర్థాలకు నిప్పు పెట్టినప్పుడు దట్టమైన పొగ అలుముకొని సమీప గ్రామాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పర్యావరణానికి కూడా చేటు తప్పడం లేదు.

**పుడమికి తీవ్ర నష్టం**

సాగులో అనాలోచిత నిర్ణయం భూమికి ముప్పుగా మారుతోంది. యంత్రాల ద్వారా పంట కోసి చేలల్లో వదిలేసిన వ్యర్థాలను కలియదున్నటం రైతులు మరిచిపోతున్నారు. ఖర్చులు అధికం అవుతున్నాయనే ఉద్దేశంతో, మళ్లీ సాగు ప్రారంభించాలని మరికొందరు పొలంలోని వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. ఇలా తగలబెట్టడం వలన భూమిలోని మిత్రపురుగులు చనిపోయి వాతావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నేల అంతా నల్లగా మారి మొక్క మొలకెత్తే వీలు లేకుండా పోతుందని చెప్పారు. అందులోని భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు పూర్తిగా నశించే అవకాశం ఉందని తెలిపారు. పైగా ఆ మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించి అగ్నిప్రమాదాలు వ్యాపించే ప్రమాదం కూడా ఉంది. మంటలతో వచ్చే పొగతో వాతావరణం కాలుష్యం ఏర్పడుతోంది. దీంతోపాటుగా పరిసరాల్లో పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా సైతం చనిపోతున్నాయి. తర్వాత సాగు చేసే పంటలకు తెగుళ్లు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**వదిలేస్తే సేంద్రియ ఎరువే..**

యంత్రాలతో కోయగా మిగిలిన వ్యర్థాలను పొలంలోనే ఉంచటం వలన సేంద్రియ ఎరువుగా మారుతుంది. భూమిలో కలియదున్నటం వలన అది కుళ్లిపోయి ఇలా మేలు జరుగుతుంది. వ్యర్థాలను చేలల్లో తగలబెట్టకుండా తొలకరి సీజన్ ఆరంభంలో మూడు వారాల ముందే చేనుకు నీరు పెట్టి వ్యర్థాలపై సూపర్‌పాస్ఫేట్ ఎరువు వేసి దమ్ము చేసి కుళ్లబెట్టుకోవాలి. అప్పుడు పంటకు ఒక విడత ఎరువు అందించినంత బలం వస్తుంది. అలా కాకుండా వేసవిలోనే దుక్కి దున్నుకున్నా కూడా సాగు సమయానికి కుళ్లిపోయి పంటకు ఎరువుగా మారే అవకాశం ఉంటుంది. పెరిగిన సాగు వ్యయంతో దీనివల్ల కొంత ఉపశమనం లభించి, దిగుబడులు కూడా పెరుగుతాయి.

**కొరవడిన అవగాహన...**

వ్యర్థాలను తగలబెట్టడం వలన కలిగే అనర్థాలపై రైతులకు అవగాహన కరవైంది. ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వరి చెత్త, మొక్కజొన్న వ్యర్థాలను తగలబెట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కొంత మేర రైతులు ఆచరణలో పెట్టినప్పటికీ ఇప్పటికీ చాలామంది అవగాహన లేమితో సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**భూమిలో కర్బన శాతం పెరుగుతుంది**



చేలల్లో ఉండే మిగిలిన వ్యర్థాలను తగలబెట్టడం వలన చాలా ప్రమాదాలు ఉన్నాయి. భూమిలోని కర్బన శాతం పెరిగి తర్వాత సాగు చేసిన పంటలు తెగుళ్ల బారిన పడే అవకాశం ఉంటుంది. క్రమేపీ భూసారం దెబ్బతినే ప్రమాదం ఉంది. అలాగే భూమిపై పంటలకు మేలు చేసే పురుగులు నశించిపోతాయి. వాతావరణ కాలుష్యం తప్పదు. రైతులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని తగలబెట్టకుండా భూమిలోనే కలియదున్నుకోవాలి.

– ఎం.అరుణ, మండల వ్యవసాయ శాఖాధికారి

### నేడు సత్తెనపల్లికి మంత్రి అచ్చెన్నాయుడు

**సత్తెనపల్లి:** నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఆదివారం రాష్ట్ర మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు సత్తెనపల్లి రానున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయ వర్గాలు శనివారం తెలిపాయి. ఆదివారం సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో నూతన సచివాలయ భవనం, ఆర్‌బీకే బిల్డింగ్, నూతన సీసీ రోడ్, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ల ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారని పేర్కొన్నాయి. అనంతరం సత్తెనపల్లి పట్టణంలోని 21వ వార్డులో స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహం, మెయిన్ రోడ్‌లో స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాద్ విగ్రహ ఆవిష్కరణ చేస్తారన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారని తెలిపారు.

### నిరంతరాయంగా విద్యుత్ అందించాలి

**పిడుగురాళ్ల:** అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఆ శాఖ ఎస్ఈ డాక్టర్ పి. విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కొండమోడు సబ్ డివిజన్ ఆఫీసులో అన్ని విభాగాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజుపాలెం మండలంలోని సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించినందున క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. పిడుగురాళ్ల పట్టణానికి సంబంధించి ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఫోన్ నెంబర్ 62817 02413ను ప్రారంభించారు. కొండమోడు సబ్ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సబ్ స్టేషన్, బైపాస్ రోడ్డులోని సబ్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మాచర్ల ఈఈ ఎన్. సింగయ్య, పల్నాడు జిల్లా సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పిడుగురాళ్ల డీఈఈ బి. నాగ సురేష్‌బాబు, ఏఈలు పవన్, పెద్ద మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


రామారావు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న శంకరరావు తదితరులు

**అమరావతి:** మండల కేంద్రమైన అమరావతి పట్నంమాలపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు, బూత్ కన్వీనర్ వెలగలేగి చెంచు రామారావు అనారోగ్యంతో మరణించారు. దీంతో మాజీ శాసనసభ్యుడు నంబూరు శంకరరావు శనివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెంచు రామారావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ.. కార్యకర్తలు అధైర్య పడొద్దని, తాను అందరికీ అండగా ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, ఎస్సీ నాయకులు తోకల సూరిబాబు, దారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**హనుమయ్యకు పరామర్శ**

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నూతలపాటి హనుమయ్య మాతృమూర్తి ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శనివారం నూతలపాటి వారిపాలెంలోని హనుమయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. హనుమయ్య తల్లి సీతారావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శంకరరావు వెంట పార్టీ నాయకులు ఈదా సాంబిరెడ్డి, నరసయ్య, సతీష్ తదితరులున్నారు.

## అంబేడ్కర్ జీవితం విద్యార్థులకు ఆదర్శం


బహుమతులు అందుకున్న వారితో సంఘం ప్రతినిధులు

**సత్తెనపల్లి:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరు విద్యార్థులకు ఆదర్శమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలికలలో అత్యధిక మార్కులు సాధించిన 50 మందికి జ్ఞాపిక, పెన్ను, నగదు పారితోషికం వంతున అసోసియేషన్ బాధ్యుడు బాదుగున్నల కమలాకర్ రావు, శివపార్వతి దంపతుల సహకారంతో శనివారం అందించారు. జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతిభావంతులను అభినందించారు. తర్వాత బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం మాధవీలత, సంఘం ప్రధాన కార్యదర్శి కేబీఆర్జే ప్రసాద్, ఉపాధ్యక్షుడు పోతులూరయ్య, బాధ్యులు పొత్తూరి రామకోటయ్య, జయ సుల్లా, బొడ్డు రామారావు, మల్లేశ్వరరావు, సుబ్బారావు, శివపార్వతి, డాక్టర్ సరికొండ రమాదేవి, పాఠశాలకు చెందిన సత్యవతి, రాధాకృష్ణ, శివపార్వతి, పద్మావతి పాల్గొన్నారు.

## ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్


కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

**సత్తెనపల్లి:** స్థానిక సార్వత్రిక క్రైస్తవ సంఘాల సమాఖ్య, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. సీయోను లూథరన్ దేవాలయం నుంచి ఆర్‌సీఎం చర్చి, రాజుల కాలనీ, బైపాస్ రోడ్, మునిసిపల్ ఆఫీస్, గడియార స్తంభం, గోళ్ళమూడి వారి వీధి, క్రిస్టియన్ పేట మీదుగా ర్యాలీ కొనసాగింది. వివిధ క్రైస్తవ సంస్థల ప్రతినిధులు జి.సుధీర్ కుమార్, కె.సత్యం, స్వరూప్ కుమార్, దయానందం, మధు, అనిల్ కుమార్, ఇజ్రాయెల్, వి.ఆర్.కె. మూర్తి, అబ్రహాం సుధాకర్, కె. కోటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, బి.భాస్కరరావు, పి.ఏసు దానం, ఎస్. సత్యానందం, వి.సంతోష్ వర్మ, ఆంద్రూస్, ప్రశాంత్, దాని, కేబీఆర్జే ప్రసాద్, సలగాల మృత్యుంజయరావు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, వంజా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**మాచర్ల రూరల్:** పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని వ్యక్తులు ఘర్షణ పడిన సంఘటనలో ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జమ్మలమడక గ్రామానికి చెందిన జలసూత్రపు శ్రీకాంత్, పవన్, నరసింహారావు అనే వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన మల్లెల శ్రీనివాసరావు మరికొందరు కలిసి ఇంటికి వెళ్లి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘర్షణలో వారి తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. ఈ మేరకు రూరల్ ఎస్సై రవికృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు వాహన దొంగలు అరెస్ట్

**14 బైకులు స్వాధీనం**


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాసరావు

**అచ్చంపేట:** ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 14 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు అచ్చంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన యాతం వీరభద్రరావు, బెల్లంకొండ మండలంలో నివాసముంటున్న చొప్పరపు శ్రీనివాసులు పలుచోట్ల బైకులు దొంగిలించారు. గతంలోనూ ఐనవోలు పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 33 బైకులు అప్పట్లో స్వాధీనం చేసుకున్నారు. జైలు శిక్ష పూర్తయ్యాక తీరు మార్చుకోలేదు. అచ్చంపేట మండలంలో దొంగతనాలు చేస్తూ సదరు బైకులను కొండూరులోని తమ బంధువుల వద్ద ఉంచారు. శనివారం ఉదయం పెదపాలెం రోడ్డులో ఇద్దరిని అరెస్టు చేశారు. దాచి ఉంచిన 14 బైకులను స్వాధీనం చేసుకుని అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉండవచ్చన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచాక రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

## పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం


సత్తెనపల్లి: పట్టణంలో చేపట్టిన ర్యాలీలో కమిషనర్ ఆనంద్‌కుమార్ తదితరులు


సత్తెనపల్లి: గుడిపూడి గ్రామంలోని ర్యాలీలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి తదితరులు

**సత్తెనపల్లి:** పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఆ దిశగా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనందకుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 'ఈ-వ్యర్థాల'పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు ప్రధాన వీధిలో ర్యాలీ నిర్వహించారు. తాలూకా సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తాలూకా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో అప్పగించాలని ప్రజలకు సూచించారు. మున్సిపల్ మేనేజర్ ఎస్ఎస్ సుభాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

**గుడిపూడిలో....**

సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో ఈ వ్యర్థాల తొలగింపు సాధ్యమని పేర్కొన్నారు. మండలంలోని 25 గ్రామాల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నందిగామలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ తొరటి తిరుపతయ్య ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. ఓపీఆర్‌డీ ఏ శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**రాజుపాలెంలో...**

**రాజుపాలెం:** ఎంపీడీవో జీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, డిప్యూటీ తహసీల్దారు బాషా, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, లంకా వీరయ్య, వాసా వెంకటేశ్వర్లు, జంగం రాజా, సభినాల వలిరాజు తదితరులు పాల్గొన్నారు.

**అచ్చంపేటలో...**

**అచ్చంపేట:** ఇంట్లోని వ్యర్థాలను కార్మికులకు అందించాలని మండల స్పెషల్ అధికారి వి.హనుమంతరావు సూచించారు. అచ్చంపేటలో శనివారం పంచాయతీ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. డంపింగ్ యార్డు వద్దకు వెళ్లి వ్యర్థాల నుంచి సంపద సృష్టించే విధానాలను పరిశీలించారు. ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పంతులూనాయక్, సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంభాల వీరబాబు పాల్గొన్నారు.

**నకరికల్లులో..**

**నకరికల్లు:** చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. నకరికల్లులో ర్యాలీ, నిర్వహించారు. ఇంటింటి నుంచి చెత్తసేకరణ చేశారు. చౌత్రాసెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేకాధికారి ఝాన్సీ రాణి, ఎంపీడీఓ జి.కాశయ్య, ఈఓపీఆర్డీ కె.వి.శివ ప్రసాద్, ఏపీఓ ప్రసాదరావు, ఏపీఓ ప్రసాదరావు, డ్వాక్రా మండల కో ఆర్డినేటర్ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

**అమరావతిలో...**

**అమరావతి:** మండల కేంద్రమైన అమరావతిలో శనివారం అమరావతి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మ్యూజియం సెంటర్ నుంచి గాంధీ బొమ్మ వరకు ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఉద్యోగు లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ ఎం.హనుమంతరావు, గ్రామ సర్పంచ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**క్రోసూరులో...**

**క్రోసూరు:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సిరిచందన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ ఈ- వ్యర్థాలు సేకరణ లక్ష్యంగా కార్యక్రమం జరిగిందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, హెల్త్ ప్రొవైడర్ హరిప్రియ, ఫార్మసిస్ట్ ఫాతిమా పాల్గొన్నారు.

**ముప్పాళ్లలో...**

**ముప్పాళ్ళ:** మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాల సేకరణపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఈఓపీఆర్డీ రూపవతి, కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, ఆర్ఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**క్రోసూరులో...**

**క్రోసూరు:** పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ర్యా లీ నిర్వహించారు. ప్రజలతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కె.వెంకయ్య, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, ఏపీవో వెంకటేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


అమరావతి: గాంధీ బొమ్మ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు


క్రోసూరు: పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది


ముప్పాళ్ళ: ప్రతిజ్ఞ చేస్తున్న డీటీ లక్ష్మీప్రసాదు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది


క్రోసూరు: స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


రాజుపాలెం: ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు


అచ్చంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


నకరికల్లు: ర్యాలీలో డీపీఓ ఎం.విజయభాస్కర్ రెడ్డి, ఇతర అధికారులు

### నాటుసారా విక్రేత అరెస్ట్


నిందితురాలి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

**అచ్చంపేట:** నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిలో ఒకరిని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి అరెస్ట్ చేశారు. సంద్ర తండాకు చెందిన మాలావత్తు సత్యవతి బాయి, జడపల్లి మోటు తండాకు చెందిన బాణావతు జమలపురి నాయక్‌లు సంద్రతండా వద్ద రెండు లీటర్ల నాటుసారా విక్రయిస్తున్నారు. అదే సమయంలో దాడులు నిర్వహించామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. సత్యవతి బాయిని అదుపులోకి తీసుకున్నామని, జమలపురి నాయక్ పరారైనట్లు తెలిపారు. రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. సత్యవతి బాయిని సత్తెనపల్లి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడంతో రిమాండ్‌కు పంపారన్నారు. మరో నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామని తెలిపారు.